క్లుప్తంగా

ఎమ్మిగనూరు డీఎస్పీగా బి.సీతారామయ్య



ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు డీఎస్పీగా బి.సీతారామయ్య బుధవారం సాయంత్రం రూరల్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను గుంటూరు వెస్ట్ జోన్ డీఎస్పీగా పనిచేస్తు ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని ఎమ్మిగనూరు టౌన్, రూరల్, మంత్రాలయం, కోసిగి సర్కిల్స్ పరిధిలోని శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో తనకు అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి.సీతారామయ్యకు టౌన్, రూరల్, మంత్రాలయం, కోసిగి సీఐలు మధుసుధన్‌రావు, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఏలిషావలి, ఎస్ఐలు మస్తాన్‌వలి, నిరంజన్‌రెడ్డి, వేణుగోపాల్‌రాజు, తిమ్మారెడ్డి, మహేష్‌కుమార్‌లు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఘనంగా దేవర



మారెమ్మవ్వకు భోనాలు సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో బుధవారం శ్రీ పెద్దమ్మ అవ్వ దేవర మహోత్సవం ఘనంగా జరిగింది. ప్రతి ఇంటి నుంచి మహిళలు పూర్ణ కుంభంతో నైవేద్యం ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

కనకవీడులో గ్రామ దేవర

నందవరం: కనకవీడు గ్రామంలో బుధవారం డప్పు దరువులు, మేళతాళాల మధ్య గ్రామ దేవర ఘనంగా జరిగింది. పురవీధుల్లో బారులు తీరిన కుంభోత్సవం ఆకట్టుకుంది. గ్రామస్తులు వేకుజామున గ్రామ దేవతలకు విశిష్ట పూజలు చేపట్టారు. అమ్మవారికి భోనాలతో నైవేద్య సమర్పణ గావించారు. బలిదానాలు కానిచ్చి ఉదయం కుంభోత్సవాలు నిర్వహించారు. ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



నంచర్ల జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీఓ వేణుగోపాల్

చిప్పగిరి: మండలంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై పీఓ, మండల స్పెషల్ అధికారి డాక్టర్ వేణుగోపాల్ బుధవారం అధికారులతో స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ కార్యాలయాల పనుల గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు నిర్మాణాలలో పురోగతి ఉండేలా చర్యలు చేపట్టాలని వారిని ఆదేశించారు. అనంతరం నంచర్ల జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. తహసీల్దారు లక్ష్మినారాయణ, ఎంపీడీఓ సుధాకర్ రాజు, ఎంఈఓ మస్తాన్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంనీలా, ఈఓపీఆర్డీ సంజన్న, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు కృషి



అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న వెంకటనారాయణ

ఆలూరు రూరల్: గర్భిణులు, చిన్న పిల్లల్లో రక్తహీనత లోపం రాకుండా చూడాలని ఆలూ రు మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక అంగన్‌వాడీ–12 కేంద్రాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సిబ్బందికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులకు సకాలంలో అందించాలన్నారు. పిల్లలకు ఐరన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయాలని సూచించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయం-3 ఉద్యోగులతో సమావేశమై అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. స్పందన అర్జీలకు 24గంటల్లో పరిష్కారం చూపాలన్నారు. స్థానిక గుంతకల్లు రోడ్డులోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి పురోగతి సాధించాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ అల్లబకాష్, ఏఓ వెంకటేష్, విద్యుత్ ఏఈ లోకేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు ఉన్నారు.

మామిడి రైతుకు వర్షం దెబ్బ

- ఈదురుగాలులు, వడగండ్ల వానకు నేలరాలిన కాయలు
- ఉన్న వాటికి నాణ్యత దెబ్బతిని నష్టపోయిన రైతులు



నేలరాలిన మామిడికాయలు



విరిగిపడిన మామిడి చెట్టు వద్ద రైతు

పత్తికొండ రూరల్: మామిడి రైతులను అకాల వర్షం దెబ్బతీసింది. మంగళవారం కురిసిన వడగండ్ల వానకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. పత్తికొండలో 38 ఎకరాల మేర, తుగ్గలిలో 180, దేవనకొండ 150, మద్దికెర 20 ఎకరాల్లో మామిడి తోటలు సాగుచేశారు. భారీ ఈదురుగాలులకు మండలంలోని పలు చోట్ల కోతకొచ్చే దశలో ఉన్న మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. మరికొన్ని చోట్ల పిందెలు నేలరాలాయి. చేతికొచ్చే పంట డెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చెట్టు నుంచి రాలిన కాయలు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయని రైతులు వాపోయారు. రేయింబవళ్లు చెమటోడ్చి కాపాడుకున్న పంట మొత్తం నేలపాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. దెబ్బమీద దెబ్బ పడినట్లుగా బుధవారం మళ్లీ కురిసిన వానకు రైతులు అల్లాడిపోయారు.

ధర ఉన్నా దిగుబడి ధమాల్

ఈదురుగాలులు, వడగండ్ల వాన మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షానికి మామిడి రైతులు కుదేలయ్యారు. ఏం చేయాలో దిక్కుతోచని దయనీయ స్థితిలో పడ్డారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్లెదుటే తుడిచిపోట్టుకుపోవడంతో కొలు రైతుల అవస్థలు చెప్పనలవి కాకుండా పోయాయి. బహిరంగ మార్కెల్‌లో మామిడి కాయలు, పండ్లకు మంచి డిమాండ్ ఉన్న సమయంలో రైతులను ఒక్కసారిగా వర్షాలు కుదిపేశాయి.

చేతికొచ్చిన పంట నేలపాలైంది



చెట్లకు కాయలు బాగానే కాశాయి. ఈసారి మంచి దిగుబడి వస్తుందని ఆశపడ్డాం. అందుకు తగ్గట్లుగానే మామిడికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే వానదెబ్బకు ఆశలు తలకిందులయ్యాయి. భీకరమైన గాలి, వానకు చెట్లమీద ఉన్న పిందెలు, కోతదశలోని కాయలన్నీ నేలరాలాయి. – లక్ష్మిదేవి, మామిడి రైతు, పత్తికొండ

ఆశలన్నీ ఆవిరయ్యాయి



మామిడి రైతుల ఆశలు గల్లంతయ్యాయి. ఎగువప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వరద ప్రవాహం ఏర్పడింది. పైపక్క వచ్చిన పెద్దవానకు నేల రాలిన కాయలన్నీ నీటిలో కొట్టుకుపోయాయి. వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. – రామాంజినేయులు, రైతు, పత్తికొండ

పంట నష్టంపై నివేదికలు పంపిస్తాం



మామిడి పంట నష్టం వాటిల్లినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. సచివాలయాల పరిధిలోని హార్టికల్చర్ అసిస్టెంట్ల ద్వారా విచారణ చేపట్టాం. పెరవలి, వెలమకూరు ప్రాంతాల్లో వేసిన అరటికి నష్టం వాటిల్లింది. పంట నష్టాన్ని అంచనా వేసి అధికారులకు నివేదిక అందజేస్తాం. – అనూష, ఉద్యాన శాఖ అధికారి, పత్తికొండ

వైఎస్సార్‌సీపీకే ప్రజామద్దతు

మద్దికెర: ప్రభుత్వ పాలనపై ప్రజా స్పందన తెలుసుకునేందుకు చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎక్కువ శాతం ప్రజలు జగనన్నకే జై కొట్టినట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ కవిదాసు బుధవారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 6,250 ఇళ్లను సందర్శించగా 5,216 కుటుంబాల నుంచి సానుకూల స్పందన లభించిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ అందించడంతో ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందన్నారు.

5 నుంచి ఉరుసు

ఎమ్మిగనూరురూరల్: గుడేకల్ గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరా స్వాముల ఉరుసు మహోత్సవం ఈ నెల 5 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు బుధవారం దర్గా ట్రస్టీ గాజి హుసేన్‌పీరా స్వాములు మాట్లాడుతూ.. 5న గంధం, 6న ఉరుసు ఉంటుందని తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకనుగునంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

12 లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఎమ్మిగనూరుటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించి 2, 4, 6వ సెమిస్టర్‌ల పరీక్ష ఫీజులు ఈనెల 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ బలరాముడు బుధవారం సూచించారు. ఇప్పటికే సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్ వెల్లడైందని, ఈ మేరకు విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు.

రీసర్వే పక్కాగా పూర్తి చేయండి



దేవబెట్టలో రీసర్వేను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: రీసర్వే పూర్తైన గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటును త్వరితగతిగా పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం దేవబెట్ట గ్రామంలో రీసర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా ఆదోని డివిజన్‌లో మొదటి విడతగా 54 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసుకొని ఇప్పటివరకు 26 గ్రామాల్లో హద్దులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 20 లోపు మిగతా గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. రీసర్వేలో ఎదురైన సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ జయన్న, ఆర్ఐ లక్ష్మణ్, సర్వేయర్ అశోక్, తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి చూపాలి



హెచ్.కైరవాడి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య

గోనెగండ్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య అధికారులకు సూచించారు. ఆయన బుధవారం గోనెగండ్ల సచివాలయం–3ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అలాగే మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలలో మన బడి నాడు–నేడు పనులు పరిశీలించి, నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో నిర్దేశిత గడువులోగా ప్రజాసేవలందించాలని, ఈర్జిదారుడు సంతృప్తి చెందేలా స్పందన వినతులను పరిష్కరించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడిన కాలనీలను అధికారులు సందర్శించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు వేగవంతం చేసేలా కృషి చేయాలన్నారు. అనంతరం హెచ్. కైరవాడి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఎంఈఓ వినోద్ కుమార్, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

నందవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పరిశ్రమల మేనేజర్ రమణారెడ్డి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నందవరం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం మండల అధికారులతో నాడు– నేడు అభివృద్ధి పనులు, స్పందన గ్రీవెన్స్‌పై సమీక్షించారు. గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు– నేడు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. అలాగే 'స్పందన' కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పక్కా ఇళ్ల నిర్మాణంతో పాటు, అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ రామచంద్రయ్య అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల నిర్మాణాలు, రెవెన్యూ, ఉపాధి హామీ పథకం పనులు, ఇతర అన్ని శాఖల అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. వందవాగిలిలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పురోగతి సాధించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ దాసానాయక్, తహసీల్దారు హుసేన్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి



మాట్లాడుతున్న మండల ఎస్ఓ ఉమామహేశ్వరి

కృష్ణగిరి: మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా జరగాలంటే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి ఉమామహేశ్వరి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, నాడు–నేడు పనులు జూన్ 10 నాటికల్లా పూర్తి చేయాలని సూచించారు. అలాగే సచివాలయాలు, ఆర్‌బీకేలు, జగనన్న హెల్త్ క్లినిక్‌లు, గృహ నిర్మాణాలు వేగంగా జరిగేలా, ముఖ్యంగా స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం కంబాలపాడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయాల ద్వారా ప్రతి రోజు కనీసం 20 నుంచి 30 సేవలు అందించాలన్నారు. రికార్డుల నిర్వహణ, సమయపాలనా తప్పక పాటించాలని తెలియజేశారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సిన్లు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వీధి కుక్కలను బుధవారం మున్సిపల్ సిబ్బంది పట్టుకొని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పశువైద్యాధికారులచే యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. వీధి కుక్కల బెడద నివారణ, వాటి సంతతి పెరగకుండా చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి



గోనెగండ్ల సచివాలయం-1లో రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మి

గోనెగండ్ల: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని జేడీఏ, మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి సూచించారు. బుధవారం గోనెగండ్లలోని 1, 2 గ్రామ సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఉద్యోగుల హాజరును పరిశీలించారు. సచివాలయంలో అందిస్తున్న సేవల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఏయే సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయి తదితర వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల ద్వారా సేవలందించడంలో జిల్లాలో గోనెగండ్ల రెండవ స్థానంలో ఉందని చెప్పారు. సచివాలయ సేవలు విస్తృతం చేయాలని, స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ అధికారి రాజాకిషోర్, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, సూపరింటెండెంట్ బాబు భాస్కర్ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సబ్సిడీ విత్తనాలకు ప్రతిపాదనలు

తుగ్గలి: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు సబ్సిడీ విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఏఓ పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలానికి వేరుశనగ 7,354 క్వింటాళ్లు, కందులు 33 క్వింటాళ్లు, మినుములు 128 క్వింటాళ్ల అవసరమవుతాయన్నారు. ఈ ఏడా ది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా మండలంలో రాగి, జొన్న, కొర్ర పంటలను ప్రోత్సహి స్తున్నట్లు చెప్పారు. సబ్సిడీవిత్తనాలు రాగానే ఆయా ఆర్‌బీకేల్లోనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే సత్ఫలితాలు

ఆలూరు: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని దేవనకొండ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ గౌరీదేవి ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వివిధ కాలనీల్లో జరుగుతున్న జగనన్న గృహాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఉపాధిహామీ పథకం, ఆర్‌బీకే, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి అధికారి అంకితభావంతో పని చేసినప్పుడే సత్ఫలితాలు ఉంటాయని, అభివృద్ధిలో పురోగతి కనిపిస్తుందన్నారు.

'పీఎంశ్రీ'కి ఎంపిక

మద్దికెర: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకానికి పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ఎంఈఓ రంగస్వామి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మిశైలజ బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ పథకంలో ఎంపికైన పాఠశాలలకు కేంద్రం నేరుగా నిధులు మంజూరు చేసి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.

కృష్ణగిరి: స్థానిక మోడల్ స్కూల్ 'పీఎం శ్రీ' పథకానికి ఎంపికైనట్లు ఎంఈఓ విజయభాస్కర్ బుధవారం తెలిపారు. ఈ పాఠశాలలో ఇప్పటికే నాడు–నేడు ద్వారా రూ.45 లక్షలతో అదనపు గదులతోపాటు పలు సౌకర్యాలు కల్పించినట్లు ఆయన వెల్లడించారు.

అడిగిన వారందరికీ పనులు

తుగ్గలి: ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న కూలీలందరికీ పనులు కల్పించాలని ఏపీఓ రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి పనులపై బుధవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జాబ్ కార్డు కలిగి ఉండి పని అడిగిన వారందరికీ పనులు చూపాలన్నారు. రోజువారీ వేతనం రూ.272పై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి రైతులను సమాయత్తం చేయాలన్నారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. 10 రకాల పండ్ల తోటలను సాగు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈనెలఖారులోగా దరఖాస్తు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు.

మండల స్థాయి సమీక్ష

వెల్దుర్తి: మండలస్థాయిలో వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న పనులు, అభివృద్ధి, పథకాల అమలుపై మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్ బుధవారం సమీక్షించారు. ముందుగా ఆయన వెల్దుర్తి, రత్నపల్లె జగనన్న లేఅవుట్‌లను పరిశీలించారు. రత్నపల్లె లేఅవుట్‌లో ఇరువురు లబ్ధిదారుల గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. రత్నపల్లె సచివాలయం తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఏఓ అక్బర్ బాష తదితరులతో సమావేశమయ్యారు. వెల్దుర్తి లేఅవుట్ గృహ లబ్ధిదారులతో వచ్చే బుధవారం సమావేశం కానున్నట్లు తెలిపారు. పనుల్లో పురగోతి, పథకాల అమలు, ముఖ్యంగా స్పందన అర్జీల పరిష్కారం ఎప్పటిప్పుడు చేపట్టాలని ఆదేశించారు.

'స్పందన' తప్పనిసరి

ఆలూరు రూరల్: అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రతి రోజు స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని ఆలూరు గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణకుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆలూరులోని 4 గ్రామ సచివాలయాలకు సర్కులర్ పంపించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లో అన్ని శాఖల సిబ్బంది అందుబాటులో ఉండి స్పందన నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



వెంకటసాయి ఆలయంలో ప్రతిష్ఠ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వెంకటసాయి దేవాలయం సింహద్వారం, శిఖర కలశంతో పాటు విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆలయ సింహద్వారం ప్రారంభించి ప్రత్యేక పూజలో పాల్గొని వేదపండితులచే ఫలప్రసాదాలు, ఆశీర్వాదం పొందారు. అంతకుముందు ఆలయంలో శ్రీగణపతి, శ్రీపార్వతిదేవి, విగ్రహ ప్రతిష్ఠాపన, వేంకటసాయి, భేడి ఆంజినేత స్వామి ఆలయ రాజగోపుర నవకలశ ప్రతిష్ఠ, గోపుర కుంబాభిషేక మహోత్సవాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం: పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో బుధవారం జరిగిన 19వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గోకారి కూతురి వివాహ వేడుకలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, నాయకులు బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భవన నిర్మాణానికి భూమిపూజ



శ్రీరాంనగర్ క్యాంపులో సొసైటీ భవనం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు

హొళగుంద: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన హొళగుంద సమీపంలోని శ్రీరాంనగర్ క్యాంపులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) నూతన భవన నిర్మాణానికి సింగిల్ విండో చైర్మన్ వందవాగిలి మల్లికార్జున అధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అప్కాబ్ బ్యాంక్ రుణ సాయం రూ.11 లక్షలతో పాటు సొసైటీ భాగస్వామ్యంతో కార్యాలయ నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. నాయకులు కుమారస్వామి, ఈశా, కోగిలతోట శేషప్ప, రామకృష్ణ, ఎల్లార్తి మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

గోనెగండ్ల: పీఎం కిసాన్ నగదు జమ కాని రైతులు ఆర్‌బీకేల్లో ఈ–కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి రాజా కిషోర్ సూచించారు. ఆయన బుధవారం గోనెగండ్ల ఆర్‌బీకే–1ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. ఆర్‌బీకే పరిధిలో ఉన్న రైతులు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి సంబంధించి ఎన్‌పీసీఐ లింక్ కాని వారు వెంటనే సంబంధిత బ్యాంకుకు వెళ్లి లింక్ చేయించుకోవాలన్నారు. అలాగే పీఎం కిసాన్ నగదు పడని రైతులు ఆర్‌బీకే కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డు తప్పులను సరిచేయించుకొని, ఈ నెల 20వ తేదీ లోపు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వమే నిర్వహించాలి

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కును ప్రభుత్వమే నిర్వహించాలని ఏఐటీయూసీ తాలుకా గౌరవాధ్యక్షుడు సత్యన్న, కార్యదర్శి బాలరాజు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం తగదన్నారు. సీపీఐ మండల కార్యదర్శి చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు తప్పనిసరి

కృష్ణగిరి: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని తొగర్చేడు రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీచేసి రైతులకు పంటలసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో బోరు, బావుల కింద పత్తి, వేరుశనగ పంటలు సాగు చేపట్టారని, ఎండలు అధికంగా ఉండటంతో మొలక శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ నెల చివర్లో లేదా జూన్ మొదటి వారంలో విత్తనం వేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. త్వరలో ఆర్బీకేల ద్వారా సబ్సిడీ కింద వేరుశనగ, కంది తదితర విత్తనాలు అందిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

ఆలూరు: హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని రాష్ట్ర ఎస్సీ, బీసీ, మైనార్టీ అధ్యక్షుడు బెళగళ్ ఉసేని పిలుపునిచ్చారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ఇబ్రహీం కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం ఆలూరు నియోజకవర్గం మాల కులస్తుల సంఘం నాయకుడు ఈరన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మాల కులస్తుల హక్కుల సాధనకు చేపట్టాల్సిన కార్యాచరణపై కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు కమ్మరచేడు గోపాల్, నాగరాజు, వీరభద్ర,భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే మెరుగైన వైద్యం

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యులు దీర్ఘకాలంగా రోగాలతో బాధపడుతున్న వారి ఇంటి వద్దకే వచ్చి చికిత్స అందిస్తున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి సూచించారు. బుధవారం హంప గ్రామంలో రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలందించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగులకు ఇంటి వద్దే మెరుగైన వైద్యం లభిస్తుందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. బుధవారం ఆలూరులోని సచివాలయం–4 పరిధిలో వృద్ధులు, రోగులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మందులు అందించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్ ట్యాబ్లెట్లు ఇచ్చారు.

రైతు భరోసాకు 130 దరఖాస్తులు

మద్దికెర: వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 2023–24కు గాను ప్రభుత్వం అందించే వ్యవసాయ పెట్టుబడి సాయం కోసం కొత్తగా అర్హత పొందిన వారు, అర్హత కలిగి గతంలో లబ్ధిపొందని భూ యజమానుల నుంచి మండలవ్యాప్తంగా 130 దరఖాస్తులు వచ్చినట్లు ఏఓ హేమలత బుధవారం తెలిపారు. ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా మొదటి విడత సాయం మేలో నేరుగా అర్హులైన రైతుల ఖాతాల్లోకి జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.